# మట్టి మనిషి

ఎండ నిప్పులు కురిపిస్తోంది. ఎటు చూసినా సెగలు ఎగుస్తున్నాయి. ఆకాశంలో చాలాసేపటి నుంచి గద్ద గిరికీలు కొడుతోంది. దానికి పై ఎత్తులో రాబందుల గుంపు వలయవిహారం చేస్తోంది. రెండింటి చూపూ నేలమీదే.

గద్ద కోడిపెట్ట వెంట తిరుగుతున్న కోడిపిల్లల మీదనే దృష్టి పెట్టింది. తల్లి నుంచి పిల్లలు వేరుపడగానే తన్నుకుపోవాలని గద్ద ఆలోచన.

రాబందుల దృష్టి బీడువారిన పొలంలో గుంతలో దొర్లుతున్న దున్నపోతు మీద ఉంది. అది మరణయాతన పడుతోంది. గొంతు ఎండిపోయింది. ఎండకు శరీరం ఎర్రబడి తాపంతో తపించిపోతోంది. చావు సంకేతాల్ని రాబందులు ముందుగా పసిగడతాయి. అందుకే అవి ఆశగా చావబోతున్న దున్నపోతు చివరిశ్వాస కోసం ఎదురు చూస్తున్నాయి.

పద్దయ్య గట్టుమీదున్న తుమ్మచెట్టు నీడలో కూచుని ఆశగా ఆకాశం కేసి చూస్తున్నాడు. పాలిపోయిన తెల్లమబ్బులు అప్పు తీర్చలేని దివాలా రైతుల్లా దిగాలుగా, దీనంగా, మెల్లగా సంచరిస్తున్నాయి. లాభంలేదు. వాటిలో నీరుంటేగా వానగా కురిపించడానికి. వాన పడితేనేగా పొలాలు కళకళలాడేది.

పద్దయ్య గాఢంగా నిట్టూర్చాడు.

కరెంటు కోతతో బోరుబావులు బావురుమంటున్నాయి. నారుమళ్ళన్నీ వాడిపోతున్నాయి. దిగుడు బావిలోంచి బానలతో బండిమీద తెచ్చిన నీళ్ళతో నారుని బతికించుకుంటున్నారు రైతులు. ఆక్సిజన్ మీద బతుకుతున్న రోగిలా ఉంది నారుమడి. "నారు బతికేనా..వాన కురిసి నాట్లు పడేనా" అన్న గుబులుతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

పద్దయ్యకి పాతరోజులు గుర్తొచ్చాయి.

పల్లెనిండా పచ్చదనం...ప్రజల గుండెల్లో ప్రేమధనం...'అక్కా బావ, మావా బాబాయి..' వరసలతో అల్లుకుపోయిన ఆత్మీయతలు...ఎవరింట్లో వేడుకలు జరిగినా అవి తమ ఇంట్లో పండగలానే కలిసిమెలిసి సంబరాలు పంచుకోవడం..ఎవరికి ఆపద కలిగనా ఆదుకోవటం..ఊరు మారిపోయింది.

మమతలూ...మనసులూ అన్నీ మారిపోయాయి. పశువులకున్న పాటి ప్రేమ మనుషులకుండటం లేదు.

ఏమిటీ జీవితం..

తాత..తండ్రి..తానుగా మూడు తరాలు చూశాడు.

తరవాత తరం సిద్ధమైపోతోంది. ఎత్తుకు పెంచిన బిడ్డలు ఎత్తుగా పెరిగారు.

"పొలాల నిండా హలాల దున్ని..." అంటూ శ్రీశ్రీ పాటలు పాడిన ప్రభంజనం మాస్టారి చూపు మాసి, చేతికర్రతో వణకుతూ తిరుగుతున్నారు.

వ్యవసాయం కూడా అలాగే తయారయింది.

హలాలకు బదులు ట్రాక్టర్లు దున్నుతున్నాయి

దిగుబడి కోసం పెట్టుబడి ఎక్కువవుతోంది.

అప్పుల తిప్పలు తప్పట్లేదు.

విత్తనాలు..పురుగుమందులు..అన్నీ కల్తీనే.

రుణ బాధకన్నా మరణబాధే మేలనుకుంటున్న రైతులు శరీర బంధాలు తెంచేసుకుంటున్నారు. వెనక మిగిలిన వాళ్ళు వెతల జీవితాలు జీవిస్తున్నారు.

దీనంగా అరుస్తున్న దున్నపోతు ఆర్తనాదానికి పద్దయ్య ఉలిక్కిపడి ప్రస్తుతంలోకి వచ్చాడు. తాను పరధ్యానంలో గమనించలేదు. ఒక్కోటిగా..యమదూతల్లా రాబందులు కిందికి దిగివచ్చి గుంతలోపడి ఉన్న దున్నపోతు చుట్టూ చేరాయి. రుణదాతల్లాగా దాన్ని బతికుండగానే పీక్కుతినే ప్రయత్నంలో ఉన్నాయి.

పద్దయ్య ఆవేశం కట్టలు తెంచుకుంది. చేతికందిన రాళ్ళు తీసుకుని రాబందుల్ని చెదరగొట్టాడు.

అవి మళ్ళీ అక్కడే వాలుతున్నాయి.

పద్దయ్య గుంత దగ్గరికెళ్లాడు. దున్నపోతు శరీరం మీద గాయాలు కనిపించాయి. అవి రక్తం ఓడుతున్నాయి. అతని గుండె నీరయ్యింది.

దున్నపోతు నీళ్ళు కారుస్తున్న కళ్ళతో పద్దయ్య కేసి చూస్తోంది. అవి వీడ్కోలు

చూపులు.

శరీరంలో శక్తి ఉన్నంతకాలమూ సేవలు చేస్తూనే ఉంది. తిన్నది గడ్డే అయినా గుడ్డి విశ్వాసం చూపించింది.

ఇప్పుడు కాటకం కాటుకు బలి అవుతోంది.

పద్దయ్య కళ్ళవెంట బాధ ప్రవహించింది.

తాను దున్నపోతును కాపాడలేడు. మనసు ఏడుస్తోంది. బతికుండగానే బలి చక్రవర్తిలాగా కండల్ని రాబందులకు ఆహారంగా అర్పిస్తోంది.

ఆ దృశ్యం చూడలేక వెనుదిరిగాడు.

ఒక్కమాటుగా రాబందులు దున్నపోతు మీదకి ఎగబడ్డాయి.

పద్దయ్యకి దున్నపోతు చివరి అరుపులు వెన్నులో గుచ్చుకుంటున్నాయి. కాలుస్తున్న ఎండలో కాలుతున్న మనసుతో వడివడిగా అడుగులు వేస్తూ ఇంటివైపు దారితీశాడు.

◆ ◆ ◆

"ఎన్నాళ్ళిలా కాటికాపరిలా ఊళ్ళో బతుకుతామయ్యా... ఉన్న రెండెకరాలు వచ్చిన కాడికి అమ్ముకుపోదాం.." విరక్తిగా అంది ఈరమ్మ.

"కాటికాపరేందే.." పద్దయ్య నిలదీసినట్టు అడిగాడు.

"మేతలేక, నీటి కరువుతో పసువులు సచ్చిపోతుండ్లా? కాటకానికి ఊరు వల్లకాడవుతుండ్లా? కాటికాపర్లు గాక మరేంది?"

తల దించుకున్నాడు పద్దయ్య.

ఒకప్పుడు దొడ్డినిండా పశువులుండేవి.

సంక్రాంతికి లక్ష్మీదేవి కొలువుదీరినట్టే ఉండేది.

మేత లేక ఎడ్లనమ్మేశాడు. బండి అమ్మేశాడు. గేదెలు అమ్మేశాడు. తండ్రి కాలంనాటి ఆవు సంతతి మిగిలింది.

"ఆవుల్ని అమ్మకూడదు. మంచిగా పెంచుకునే వాళ్ళకి దానమియ్యాల" అనేవాడు తండ్రి.

కొన్ని దానం చేశాడు. ఇక మిగిలినవి ఆవు, దూడ.

'గో రవమే- గౌరవం' అనేవాడు తాత.

ఆయనకీ గోవులంటే ఆరోప్రాణం. 'గోమాలచ్చిమి' అంటూ ప్రేమగా గంగడోలు నిమిరేవాడు. మోర పైకెత్తి ఆనందంగా నిలబడేది గోమాత.

కాలం కళ్ళముందే కదిలిపోయింది.

వర్తమానం క్షణం క్షణం గతంలోకి జారిపోతోంది. కరిగిపోని కలలా పదేపదే గతం గుర్తుకొస్తూ గుండెలో బాధ రగిలిస్తోంది.

"ఏమిటాలోచిస్తన్నా..ఒక్కగానొక్క కూతురు ఈ ఊళ్ళో శిలేసుక్కూసుంటే.. పెళ్ళి ఎట్టా సేద్దామని? పొలం అమ్మి పట్నం పోదాం పద...ఆడనే కూలినాలి సేసుకుందాం. మంచి కుర్రోణ్ని సూసి పిలదానికి పెళ్ళి సేద్దాం..."

పద్దయ్య మౌనంగా వింటుండిపోయాడు.

నిజమే. పిల్ల పెళ్ళి చెయ్యాలి. ఇన్నాళ్ళుగా ఆ బాధ్యత గుర్తుకిరాలా...ఇప్పుడు ముల్లులా గుచ్చుకుంటోంది.

ఆస్తులన్నీ అమ్ముకుని పట్నం వెళ్ళక తప్పదా...

తన సమస్యకి అదే పరిష్కారమా?

పొరుగింటి పున్నయ్య రెండు నెల్ల క్రితమే అన్నీ అమ్ముకుని పట్నం వెళ్ళాడు. వెళ్ళాక తనకి ఉత్తరం కూడా రాశాడు. ఓ మాటు తమింటికి రమ్మని ఆహ్వానించాడు కూడా.

ఏదయినా స్వయంగా చూస్తేగానీ నిజం తెలియదు.

000

పున్నయ్య మొహంలో పున్నమి వెన్నెలొచ్చినట్లయింది. పద్దయ్యను ఆనందంగా ఆహ్వానించాడు. అతిథి మర్యాదలన్నీ ఘనంగా చేశాడు. పట్నమంతా తిప్పి చూపించాడు.

పున్నయ్య మూడో అంతస్తులో కాపురం. ఇరుకు గదులు. రైలు పెట్టెల్లా వరసగా ఉంటాయి. దానికి మూడు వేలు అద్దెట. అంటే అయిదు బస్తాల వడ్లతో సమానం.

అదిగాక బియ్యం, సరుకులు, కూరలు, పాలు...ఇవన్నీ కలిపితే పదివేల పైమాటే. బియ్యం మల్లెపువ్వుల్లా తెల్లగా ఉన్నాయి. అందులో ఇసుమంత కూడా బలం ఉండదంటారు. అటుపైన సుగర్ రోగాలు. పట్నంలో రోగాలు రావటానికి పసలేని తిళ్ళే కారణం అంటారు.

రోగాలు వచ్చాక పథ్యాలు మొదలెడతారు. నడకనే వైద్యంగా చేసుకుంటారు.

పద్దయ్య పట్నం జీవితాన్ని అన్ని కోణాల్లోంచీ నిశితంగా పరిశీలించాడు. అర్థమైన విషయాలన్నీ మనసులో భద్రంగా ఉంచుకున్నాడు.

◆ ◆ ◆

"కోడూరెళ్ళి కొంగరెట్ట తెచ్చాడన్నట్టు పట్నం ఎల్లొచ్చి పనికిరాని ఇషయాలు మోసుకొచ్చావన్నమాట.." ఈసడింపుగా అంది ఈరమ్మ.

"ఇందులో పనికిరానివేంది? పెనంమీద వేడిగా ఉంది గదాని కిందికి దూకితే పొయ్యిలో పడతాం. బస్తీ బతుకులు మనకన్నా అద్వానంగా వున్నయి. దూరపుకొండలు నునుపు అని. దగ్గరకి పోతేగానీ అసలు బండారం బయటపడదు"

"నువ్వెన్నయినా సెప్పు.. ఈడ బతకటం కుదిరేపని కాదు. కట్టెదుటే పసువులు సచ్చిపోతన్నాయ్.. తింటానికి మేతలేదు. తాగటానికి నీళ్ళు లేవు. బర్రెలు పాలియ్యడం లేదు. దూడలు సిక్కిపోతన్నయ్. అద్దెకి పంపే దున్నపోతు సావనే సచ్చింది. తెల్లారితే బయం, పొద్దుకూకితే బయం.. వంటలోకి ఏం సెయ్యాలో తెలియదు. కూరలు ఎట్టాగూ లేవు. ఆకు కూరలు కూడా దొరకటం లేదు. ఒక్కగానొక్కపిల్ల. ఎట్టా వుందో సూడు. కొయ్యబొమ్మకి సీర కట్టినట్టుగా వుంది. దీన్నెవడు మనువాడతాడు?"

మొద్దుబారిన పద్దయ్య మనసు మీద ఆ వడగళ్ళవాన ఎలాంటి ప్రభావమూ చూపలేకపోయింది. ఆ సంగతి ఈరమ్మకి అర్థమైంది.

"నువ్వెట్టాగూ సెప్పినమాట ఇనవుగానీ.. పిల్లని తీసుకుని మా పెద్దన్న ఇంటికి పోతా... బస్తీలో బజ్జీల బండి పెట్టుకుని హాయిగా బతుకుతన్నడు.."

"పోతే పో.. ఎల్లాకగానీ అసలు సంగతి అర్థం కాదు" విసుక్కున్నాడు.

◆ ◆ ◆

మేడిపళ్ళు గాలికి రాలిపడుతున్నాయి.

పద్దయ్య ఆవును చెట్టు మొదలుకి కట్టేశాడు. ఆవు వెంటే దూడ.. రెండూ బక్కచిక్కి ఉన్నాయి. రాలిపడిన మేడిపళ్ళు ఆబగా తింటున్నాయి. ఆవును మేతకొదిలే రోజులు పోయాయి. దొంగతనంగా కసాయి కొట్టానికమ్మే రోజులొచ్చాయి. ఊళ్ళో పశువుల దొంగలెక్కువయ్యారు. ఎవరి దగ్గరా పశువుల మేత లేదు. ఒకప్పుడు పురులు గిరికూనల్లా ఎత్తుగా కనులవిందుగా ఉండేవి. ఇప్పుడు పరకలు దొరకటమే గగనంగా ఉంది. గడ్డివాములు లేనేలేవు.

పగలంతా ఆవు మేతకోసం తిరిగి తిరిగి దొరికిన ఆకులు, అలములూ, ఎండిపోయిన పచ్చగడ్డీ తెచ్చి పడేస్తున్నాడు పద్దయ్య. వాటినే అమృతసమంగా ఆరగిస్తున్నాయి ఆవు, దూడ.

రాత్రులు ఆవుకొట్టం దగ్గరే మంచం వేసుకు పడుకుంటున్నాడు పద్దయ్య. రెండు మూడుమాట్లు మనుషుల అలికిడి, గుసగుసలు వినిపించి పెద్దగా కేకలు

పెట్టాడు. దాంతో దొంగలు పారిపోయారు.

ఈరమ్మ అన్న ప్రకారమే పెద్దన్న దగ్గరకెళ్ళిపోయింది.

వచ్చీరాని వంటతో దినాలు గడుపుతున్నాడు పద్దయ్య.

ఊళ్ళో కొందరు విశ్వాసులు వానలకోసం పూజలు, హోమాలు, బలులు కూడా చేస్తున్నారు. కప్పల్ని కర్రలకు అటూ ఇటూ కట్టి, వేప మండలతో నీళ్ళు చల్లుతూ వానదేవుడి మీద పాటలు పాడుతూ ఊరంతా తిరిగారు. ఇన్ని చేసినా చుక్క వానపడలేదు.

ఎందుకిలా జరుగుతోంది?

ఏమిటీ ఘోరకలికి కారణం..ఊళ్లో ఇవే తరచుగా తర్జనభర్జనలు.

"అడవులు నరికేస్తున్నారు. ఊళ్ళలో చెట్లని పెరగనివ్వటం లేదు. వానలెట్టా కురుస్తాయ్?" అని ఇంకొందరు.

"దేవుడూ లేడూ దెయ్యమూ లేదు. మూఢనమ్మకాలు మానేసి స్వయంకృషిని నమ్మండి. అదే అన్ని సమస్యలకు పరిష్కారం.." అని ఒక హేతువాది చురక.

"సముద్రంలో వాయుగుండం పడినా బావుణ్ణు.."

"ఇదే పరిస్థితి కొనసాగితే ఊరు పాడుబడిపోతుంది."

"ఇప్పటికే ఊళ్ళో సగంమంది వెళ్ళిపోయారు. మమకారం చావక మిగిలినవాళ్ళు ఊగిసలాడుతున్నారు"

"మమకారాలన్నీ మన ఆకారాలు ఉన్నప్పుడేగా. మనిషి బతకటమే గడ్డుగా వున్నప్పుడు మమకారాలు ఎంతకాలం వుంటాయి..."

బిడ్డ కడుపునిండా కూడు పెట్టలేకపోతోంది తల్లి.ముసలి తండ్రికింత ముద్ద పెట్టలేకపోతున్నాడు కొడుకు. పశువులకి మేత లేదు. దూడలకి పాలు లేవు. ఎన్నాళ్ళిలా ఈ ఊరుని నమ్ముకుని ఉంటారయ్యా.."

ఇవీ రచ్చబండ రగడలు.

◆ ◆ ◆

పద్దయ్యకు నిద్రాభంగమైంది.

ఆవు అటూ ఇటూ గింజుకుంటూ ఆర్తిగా అరుస్తోంది. ఒక్క ఉదుటున మంచం మీదినుంచి లేచి లాంతరుతో ఆవు దగ్గరకు వెళ్ళాడు. వెలుగులో బుసలు కొడుతున్న నల్లతాచు. పక్కనే నురగలు కక్కుతూ కళ్ళు తేలేస్తున్న ఆవుదూడ కన్పించాయి. బిడ్డ మరణం చూస్తూ ఆవు తల్లడిల్లిపోతోంది. నల్లతాచు ఆవును కాటెయ్యడానికి

ప్రయత్నిస్తోంది.

వెంటనే కర్ర అందుకున్నాడు పద్దయ్య. కసిగా తలమీద కొట్టేందుకు చేస్తున్న ప్రయత్నాల్ని తెలివిగా తాచు తిప్పికొడుతోంది. అంతకంతకూ పద్దయ్యకు పట్టుదల అధికమౌతోంది. తాచుని ప్రాణాలతో వదలకూడదని నిశ్చయించుకున్నాడు. ఆవేశంతో రొప్పు వస్తోంది. చివరకి ఒక దెబ్బ నడుంమీద పడింది. అంతే, తాచు కదల్లేక పోయింది. వరస దెబ్బలతో తాచు ప్రాణం వదిలింది. కర్రతో తీసుకెళ్ళి దూరంగా విసిరేశాడు. తిరిగి వచ్చేసరికి బిడ్డని వాసన చూస్తూ ఆవు కన్నీరు పెడుతోంది. దీనంగా అరుస్తోంది. పేగుబంధం అలాంటిది.

దూడని పరిశీలనగా చూశాడు పద్దయ్య.

నిశ్చలంగా చావు ఒడిలో చివరి నిద్ర పోతోంది. ఆప్యాయంగా ఒళ్లంతా నిమిరాడు. దుఃఖం ముంచుకొచ్చింది. అది పుడుతూనే ఇంట్లో అందరికీ జున్ను తినిపించింది. కళ్లముందు గంతులు వేస్తూ కనువిందు చేసింది. పాలు కరువైనా, మేత తక్కువైనా తల్లి ప్రేమతో జీవించింది. పెద్దయి ఉంటే ఎన్ని దూడలకు జన్మ ఇచ్చేదో...

పద్దయ్యకి కన్నీళ్ళు ఉబికాయి. దూడ శవం మీద తర్పణాలుగా రాలాయి. ఆవు పద్దయ్య వెన్నుకి తల ఆనించింది. వెనుదిరిగి ఆవు మెడ కౌగిలించుకుని బిగ్గరగా ఏడిచాడు.

అలా చీకటి చీలిపోయేదాకా ఏడుస్తూనే ఉన్నాడు.

◆ ◆ ◆

"నన్ను చమించయ్యా...ఆశతో నాశనం తెచ్చుకున్నాను.." కాళ్ళను చుట్టేసిన ఈరమ్మని లేవదీసి "ఏమైంది..మనబిడ్డ లచ్చుమ్మ ఏది?" అనడిగాడు పద్దయ్య కీడు శంకిస్తున్న మనసుతో.

ఈరమ్మ వలవల ఏడుస్తూ "నా కళ్ళముందే బిడ్డని లాక్కుపోయారయ్యా...పోలీసులకి సెప్పినా లాబం లేకపోయింది" అంది.

పద్దయ్య స్థాణువై నిస్సత్తువగా కూలబడిపోయాడు.

"అయ్యా..అయ్యా...నువ్వు కూడా నన్ను అన్యాయం సెయ్యబోకయ్యా" అంటూ మొత్తుకుంది. ఈరమ్మ మొగుడు పడిపోకుండా పట్టుకుంది.

పద్దయ్య కళ్ళముందు కూతురు రూపం మెదులుతోంది. ఆవు దూడని కాలనాగు కాటేసినట్లే, కూతుర్ని బస్తీ బద్మాష్‌లు మాయం చేశారు. అతని గుండె

తల్లడిల్లిపోయింది. చేతుల్లో మొహం కప్పుకుని వలవలా ఏడ్చాడు. ఇటు ఈరమ్మ కూడా...

◆ ◆ ◆

ఆకాశం గట్టిగా ఉరిమింది. మెరుపులు మెరిశాయి. నింగివైపు ఉలిక్కిపడి చూశాడు పద్దయ్య. వేగంగా మబ్బులు కమ్ముకుంటున్నాయి. చూస్తుండగానే వాన ముంచుకొచ్చేసింది.

పాత బాకీలన్నీ వడ్డీతో సహా చెల్లిస్తున్నట్టు జోరున జడివాన.

నేల నెరియల్లోకి వేగంగా నీరు చొచ్చుకుపోతోంది.

పుడమి ఒడి నిండిపోతోంది. ఎండిన గుండె పులకిస్తోంది. ఊరి మొహమ్మీద చిరునవ్వు చిందులు వేస్తోంది.

అలా మొదలైన వాన ఆగకుంగా మూడు రోజులు కురిసింది. మట్టి అడుగున నిద్రపోతున్న పసరికలు పల్లవించాయి. ఎండిన చెట్లు కొత్త చివుళ్ళు తొడిగాయి.

రైతులు నాట్లు వేశారు. పశువులు గడ్డిపరకల్ని పథ్యం మెతుకుల్లా ఏరి ఏరి తింటున్నాయి.

పద్దయ్య ఆవుని వెంటబెట్టుకెళ్ళాడు. పొలం గట్టున వదిలి తన పనిలోకి దిగాడు. కలుపుమొక్కలు పీకుతూ కొద్దిసేపు కాలక్షేపం చేశాడు. అంతలో ఈరమ్మ గంపలో భోజనం తెచ్చింది.

చేతులు కడుక్కొచ్చి కంచం చేతిలోకి తీసుకున్నాడు.

ఈరమ్మ కంచం నిండా అన్నం పెట్టి గోంగూర పచ్చడి వేసింది. సన్న పచ్చి మిరపకాయ చేతికిచ్చింది.

"ఏవయ్యా.. ఈ కరువు రోజులు ముగిసినట్టేనా.. ఈ ఏడాది పంట సజావుగా చేతికొస్తదా?" అడిగింది ఈరమ్మ.

"ఏం సెబుతాం..నింగీ నేలని నమ్ముకున్న వోళ్ళం. నింగి నీరియ్యాల..నేల పంటియ్యాల..అప్పుడే మనలాంటి మట్టి మనుషులకి బతుకు..."

"మళ్ళా మబ్బు పడుతోందయ్యా...తొందరగా తిను..ఇంటికిపోతా" అంది ఈరమ్మ ఆకాశం కేసి ఆందోళనగా చూస్తూ.

"నీతో పాటు ఆవు వెంటబెట్టుకెల్లు"

"అల్లాగేలే నువ్వు తిను..." తొందరచేసింది. పద్దయ్య గబగబా ముద్దలు మింగి తినటం పూర్తి చేశాడు. అయినా రానే వచ్చింది మబ్బుల గొడుగు. వెర్రిగాలితో

పాటు వెలుతురు గీతల్లా మెరుపులు.

"ఈ వానలో నువ్వేం పనిచేస్త...ఆవును తీసుకు ఇంటికెళ్దాం పద" అంది ఈరమ్మ.

"ఇంకా పొద్దు చాలా ఉంది. వానెంత సేపు పడుద్ది. కలుపు మొక్కలు లాగేసి వస్తాలే..నువ్వు పద" అంటూ పొలంలోకి దిగాడు. ఆవు చెట్టుకింద నిలబడింది. గంపలో గిన్నెలు సర్ది ఈరమ్మ చేతులు కడుక్కునేందుకు బోరుదగ్గరకెళ్ళింది.

సరిగ్గా అప్పుడే పెద్ద శబ్దంతో ఆవు నిలబడ్డ చెట్టుమీద పిడుగు పడింది. బిత్తరపోయి అటు చూసిన పద్దయ్యకు నేల కూలిన ఆవు కనిపించింది. భయంతో ఈరమ్మ బిగుసుకుపోయింది. పద్దయ్య కొద్ది నిమిషాలకు తేరుకుని ఆవు దగ్గరకెళ్లాడు. బిక్కుబిక్కుమంటూ ఈరమ్మ కూడా అక్కడికొచ్చింది. ఆవులో చలనం లేదు. చర్మం మీద కాలిన గుర్తులు..చేత్తో తడుముతూ కన్నీళ్ళతో తడిసిపోయాడు పద్దయ్య.

తరతరాల వారసత్వానికి చివరి గురుతు చెరిగిపోయింది.

ప్రకృతి ఎందుకిలా పగ తీర్చుకుంటోంది? ఎవరిని శిక్షిస్తోంది? ఎందుకు శిక్షిస్తోంది? ఇలా ఎంతకాలం శిక్షిస్తుంది?

ఎవరు చెప్పగలరు వీటికి సమాధానాలు..

మట్టి ఎప్పుడూ మౌనంగానే వుంటుంది. మనుషులే.

(ప్రజాశక్తి సంక్రాంతి కథానికల పోటీలో ఎంపికైన రచన)